ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 30 నవంబరు www.prajaswaramdaily.com 3 pm

# ఎయిర్ హోస్టెస్‌తో అనుచిత ప్రవర్తన

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్టు



హైదరాబాద్: ఎయిర్ హోస్టెస్‌తో అనుచితంగా ప్రవర్తించిన సాఫ్ట్ వేర్ ఉద్యోగిని శంషాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తున్న విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేరళకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పోలీసులు గుర్తించారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నేషనల్ హెరాల్డ్ కేసు-

## సోనియా, రాహుల్‌పై

# కొత్త ఎఫ్ఐఆర్

### నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసిన దిల్లీ పోలీసులు





ఢిల్లీ, ప్రజాస్వరం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదైంది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ పోలీసులు దాన్ని నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఫిర్యాదు మేరకు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతో పాటు యంగ్ ఇండియా సంస్థ కూడా కుట్ర, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపిస్తోంది. ఈ ఆరుగురిపై నేరపూరిత కుట్ర అభియోగాలు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పార్టీ అగ్రనాయకత్వంపై మోదీ-షా ద్వయం బెదిరింపులు, రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసు బోగస్ అని అంతిమంగా న్యాయం గెలుస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. బెదిరింపులకు పాల్పడేవారు అభద్రత, భయంతో ఉంటారని రాసుకొచ్చారు

# అంగారక గ్రహ.. కృత్రిమ వాతావరణ పరిస్థితుల్లోనూ డ్రోన్లు..

### యువత ప్రయత్నం

### పరిశోధన రంగంలో భారత్ జోరు

### ప్రధాని మోదీ




ఢిల్లీ, ప్రజాస్వరం : అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారని ప్రధాని మోదీ అన్నారు. వాటికి జీపీఎస్ మద్దతు లేకపోవడం వల్ల డ్రోన్లు నేలకూలుతున్నప్పటికీ.. పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఈ వీడియో తన దృష్టిని ఆకర్షించిందన్నారు. అందులో యువతలో ఉన్న ఇటువంటి గొప్ప సంకల్ప బలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు. పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందన్నారు. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని.. మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిందని అన్నారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని వ్యాఖ్యానించారు.

# యూకేలో భారత విద్యార్థి హత్య

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన హర్యానా యువకుడు

### ఐదుగురు అనుమానితులను అరెస్టు



లండన్ : ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లిన హర్యానా యువకుడు అక్కడ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నెల 25న దుండగులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబం, యూకే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగి. ఉన్నత చదువుల కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది ప్రారంభంలో యూకే వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 25న వోర్ స్టర్ లో విజయ్ పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన విజయ్ ను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ విజయ్ తుదిశ్వాస విడిచాడు. విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన యూకే పోలీసులు.. విజయ్ పై దాడి చేసిన దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. విజయ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని విదేశాంగ శాఖకు, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీలకు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# కన్నడ హాస్య నటుడు కన్నుమూత

### ఆరు దశాబ్దాల్లో 350లకు పైగా చిత్రాలు



బెంగళూరు,ప్రజాస్వరం : సీనియర్ కన్నడ నటుడు ఎం.ఎస్. ఉమేష్ (80) ఆదివారం కన్నుమూశారు.
తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉదయం 8:30 గంటలకు తుదిశ్వాస విడిచారు. 350కు పైగా చిత్రాలలో నటించి, ఆరు దశాబ్దాలకుపైగా కన్నడ పరిశ్రమలో పనిచేశారు. బి.ఆర్. పంతులు దర్శకత్వం వహించిన చిల్డ్రన్స్ స్టేట్ సినిమా ద్వారా 1960లో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. భాగ్యవంతుడు, ఖిలాడి జోడి, కమనాబిల్లు, గురు శిష్యుడు, భూమిగే బండ భగవంత్, హాలు జేను, శ్రుతి సెయిరిడా, నన్నసేయ హూవే, జాకీ, ముస్సంజే మతు, డేర్‌డెవిల్ ముస్తఫా, హగలువేష వంటి 350కి పైగా చిత్రాలలో ఆయన నటించారు. ఆరు దశాబ్దాలుగా కన్నడ సినీ ప్రేమికులను అలరించిన ప్రముఖ కళాకారుడి మరణం పట్ల చిత్ర పరిశ్రమకు చెందిన నటులు, నటీమణులు , రాజకీయ నాయకులు సంతాపం తెలుపుతున్నారు.

# ప్రేమించిన యువతి పెళ్లి చేసుకుందని..

### యువకుడు బలవన్మరణం



కుత్బుల్లాపూర్, ప్రజాస్వరం : ప్రేమించిన యువతి మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఇంజినీరింగ్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..
గుంటూరు జిల్లా పొత్తూరు ప్రాంతానికి చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. వారి కుమారుడు నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడు ప్రేమించిన యువతికి ఆరు నెలల క్రితం వివాహమైపోవడంతో అప్పటి నుంచి ముభావంగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


# కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం

### 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా దగ్ధం

### సమ్మక్క జాతర కోసం నిల్వ ఉంచిన సరుకు బూడిద

### కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా

### విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమిక నిర్ధారణ



కొండగట్టు, ప్రజాస్వరం : జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శనివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 32 బొమ్మల దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వ్యాపారులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.
గత రాత్రి 11 గంటల సమయంలో కొండగట్టు ఘాట్ రోడ్డులోని అభయ హనుమాన్ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న బొమ్మల దుకాణాల్లో మంటలు చెలరేగాయి. సమీపంలో జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు భారీ ఎత్తున బొమ్మలను కొనుగోలు చేసి దుకాణాల్లో నిల్వ ఉంచారు. ఒక్కో దుకాణంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. తమ కళ్లెదుటే సర్వస్వం కాలిపోవడంతో వ్యాపారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్యాల, ధర్మపురి సీఐలు రవి, రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సమావేశాలు సజావునకు సహకరించాలి

### విపక్షాలను కోరామన్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు

### 36 రాజకీయ పార్టీల నుంచి 50 మంది నేతలు రాక



ఢిల్లీ, ప్రజాస్వరం : పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించాలని విపక్షాలను కోరాం అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 36 రాజకీయ పార్టీల నుంచి 50 మంది నేతలు సమావేశంలో పాల్గొన్నారు . పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించాలని విపక్షాలను కోరామన్నారు. రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ విపక్షాలు చర్చల్లో పాల్గొనాలని సభను ఆటంకపరచవద్దని కోరినట్లు వెల్లడించారు.



# రోహిత్ శర్మ కొత్త రికార్డు

రాంచి : బ్యాటర్ రోహిత్ శర్మ వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల వీరుడిగా నిలిచాడు. రాంచిలో దక్షిణాఫ్రికా, టీమ్ఇండియా మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్ దీనికి వేదికైంది. వన్డేల్లో అత్యధిక సిక్స్‌ల (352) వీరుడిగా నిలిచాడు.